క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న మంత్రి బీసీ

సంజామల: సంజామల–ముదిగేడు రోడ్డు నిర్మాణానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లడుతూ.. రూ.12.58 కోట్లతో ముదిగేడు నుంచి సంజామలకు 6 కిలోమీటర్లు డబుల్ రోడ్డు మంజూరైందని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ మహేశ్వర్ రెడ్డి, ఈఈ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ అనిల్ కుమార్, డీఈ సునీల్‌రెడ్డి, ఏఓ విజయకుమార్‌రెడ్డి, ఈఓఆర్డీ రాధికరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా చౌడేశ్వరి పల్లకీ సేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్య సమర్పణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీపై కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచాయతీ కార్మికులకు పెంచిన వేతనాల పంపిణీ

బనగానపల్లెరూరల్: బనగానపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న 92 మంది కార్మికులకు పెంచిన వేతనాన్ని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..ఇచ్చిన హామీ మేరకు ఒక్కో కార్మికుడికి వెయ్యి చొప్పున వేతనం పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

డోన్ టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17వ తేదీ డోన్ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరామ్ కోరారు. శుక్రవారం సీడీపీఓ శంషాద్‌బేగంను కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, సమ్మె కాలం ఒప్పందాలను అమలు చేయాలనే డిమాండ్‌ల సాధన కోసం ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.

ఏపీఎంను సస్పెండ్ చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, వీఓఏలు

బేతంచెర్ల: రాజకీయ నాయకులకు బానిసగా మారి వీఓఏలను తొలగిస్తున్న వెలుగు ఏపీఎం మధుసూదన్‌గౌడ్‌ను సస్పెండ్ చేయాలని సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, మధుశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం బేతంచెర్లలో సీఐటీయూ నాయకులు, వీఓఏలు నల్లరిబ్బన్‌లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. గ్రామాల్లో సభ్యుల తీర్మానం లేకుండా అక్రమంగా తొలగించిన వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలన్నారు. వీఓఏలు మహేశ్వరి, లక్ష్మీదేవి, మునయ్య, లలితమ్మ, ఆదిలక్ష్మి, విజయశాంతి, వెంకటరమణ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

డోన్ టౌన్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని.. నిధులు కేటాయించకుండా వివక్ష చూపడం దుర్మార్గం అని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, నాగరాజు, సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు రామాంజనేయులు, భాస్కర్‌రెడ్డి అన్నారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమిలో టీడీపీ, జనసేన భాగస్వాములుగా ఉన్నా రాష్ట్రానికి నిధులు తీసుకురావడంతో విఫలమయ్యారన్నారు. రాష్ట్ర విభజన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు.



సబ్‌జైలు వెనుక వైపు చెత్తకు నిప్పు పెట్టిన స్థానికులు



బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్ ఆవరణలో..

పేరుకుపోయిన నిర్లక్ష్యం

- పట్టణంలో పేరుకుపోతున్న చెత్త
- మరమ్మతులకు గురైన చెత్త తరలింపు వాహనాలు
- నిప్పుపెడుతున్న స్థానికులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

డోన్: స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర అంటూ హడావుడి చేస్తున్న మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. చెత్త తొలగింపుపై దృష్టి సారించకపోవడంతో డోన్ పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. చెత్తకు కొందరు నిప్పు పెడుతుండడంతో ఆ పొగకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు చెత్త.. మరో వైపు పొగతో వచ్చే దుర్గంధంతో ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణంలో చెత్తను తరలించే రెండు భారీ వాహనాలకు లిఫ్టు సిస్టం పని చేయడం లేదు. మరమ్మతులకు నోచుకోకపోవడంతో డంపింగ్ యార్డుకు చెత్తను తరలించేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. రెండు ట్రాక్టర్లకు సెల్ఫ్ లేకపోవడంతో పట్టణంలో పలు ప్రాంతాల్లో చెత్తను సేకరించేందుకు వెళ్లి లోడింగ్ చేయడంతో పాటు ట్రాక్టర్లను కూడా తోయాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. గతంలో ఉదయం 4 గంటలు, సాయంత్రం నాలుగు గంటల పాటు సులువుగా చెత్తను ఎత్తి డంప్‌యార్డుకు తరలించేవారు. ప్రస్తుతం రెండు భారీ వాహనాల లిఫ్టు మరమ్మతులకు నోచుకోకపోవడం, ట్రాక్టర్లకు సెల్ఫులు లేకపోవడంతో పాటు చెత్తను తరలించే రెండు ట్రాలీ ఆటోలు మూలన పడడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. స్థానికులు కొందరు ఆ చెత్తకు నిప్పు పెడుతున్నారు. కొన్నిచోట్ల తొట్లలోని చెత్తను కిందవేసి గంపలతో వాహనాల్లోకి ఎత్తివేయలేక సిబ్బంది అలాగే వదిలి వెళ్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో గత్యంతరం లేకనే చెత్తకు నిప్పు పెట్టాల్సి వస్తోందని చెబుతున్నారు.



వాహనానికి లిఫ్టు చెడిపోవడంతో చేతికర్రతో చెత్తను తోస్తున్న సిబ్బంది

వేగవంతంగా భూముల రీసర్వే

కొలిమిగుండ్ల: పైలెట్ ప్రాజెక్ట్ కింద గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వే వేగవంతంగా జరుగుతోందని నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల రెవెన్యూ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డితో కలిసి వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో గత ప్రభుత్వంలో 112 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. ప్రస్తుతం 13 గ్రామాల్లో జరుగుతోందని తెలిపారు. డివిజన్‌లో 217 రెవెన్యూ గ్రామాలున్నాయన్నారు. ఇళ్ల పట్టాలు మంజూరై రెండేళ్ల నుంచి ఎలాంటి నిర్మాణాలు చేయకుండా ఖాళీగా ఉంటే రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్ ద్వారా ఇళ్ల పట్టాలపై సర్వే జరుగుతోందని తెలిపారు. కొత్తగా అర్హులైన లబ్ధిదారులకు మూడు సెంట్ల స్థలం ఇచ్చేందుకు ఈసర్వే జరుగుతోందన్నారు. గతంలో ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకుంటే వాటిని రద్దు చేస్తామని పేర్కొన్నారు. ఇటిక్యాల రెవెన్యూ పరిధిలో కొన్ని స్థలాల్లో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. రైతులకు పట్టాదారుపాసు పుస్తకాల సమస్య లేదన్నారు. కొద్ది రోజుల నుంచి రీసర్వే జరిగిన గ్రామాల్లో భూముల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోగా ప్రస్తుతం క్లియర్ అయినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ విశ్వనాథ్

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహనచోదకులకు జరిమానా విధించారు.

దాడి కేసు నమోదు

కోవెలకుంట్ల: మండలంలోని ఎం. గోవిందిన్నె సమీపంలో పొలం రస్తా విషయంలో శుక్రవారం ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. రేవనూరు పోలీసుల సమాచారం మేరకు.. వెలగటూరుకు చెందిన రామచంద్రుడు, గోవిందిన్నెకు చెందిన రామేశ్వరరెడ్డి మధ్య రస్తా విషయమై వాగ్వాదం చోటు చేసుకుంది. రామచంద్రుడుపై రామేశ్వరరెడ్డి దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మానసిక వైకల్య పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ



ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటున్న డాక్టర్ విద్యాసాగర్

కోవెలకుంట్ల: మానసిక, శారీరక వైకల్యం కలిగిన పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు రేవనూరు పీహెచ్‌సీ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలోని ఆయా గ్రామాల్లో 18 సంవత్సరాల్లోపు వయస్సు ఉండి మానసిక, శారీరక వైకల్యం ఉన్న పిల్లల ఆరోగ్య పరిస్థితులపై వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇలాంటి పిల్లల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామన్నారు. అందుబాటులో ఉన్న వైద్య పరీక్షలు, ఫిజియోథెరపి వైద్యం, సదరం సర్టిఫికెట్ల జారీ తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ప్రభావతి, గిరిజ, న్యాయవాది ఓబులేసు, పారా వలంటీర్ దస్తగిరి పాల్గొన్నారు.

గాయపడిన వృద్ధురాలు మృతి

కోవెలకుంట్ల: పట్టణంలోని సంతమార్కెట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు శుక్రవారం మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని జోళదరాశికి చెందిన రామక్క(75) గురువారం సొంత పనుల నిమిత్తం కోవెలకుంట్లకు వచ్చింది. రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. ఈ ఘటనపై కోవెలకుంట్ల పోలీసులు విచారణ చేస్తున్నారు.

గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలి

కోవెలకుంట్ల: గ్రామ పంచాయతీల ఆదాయం పెంచే పనులపై సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్లా అన్నారు. శుక్రవారం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త సంపద కేంద్రం)ని పరిశీలించారు. కేంద్రంలో నిర్వహిస్తున్న వర్మీకంపోస్టు, డ్రైవేస్ట్, బుష్ క్యాట్స్ తయారీ, ప్లాంటేషన్, వర్మికంపోస్టు ఎరువు జల్లెడ పట్టడం, తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. వర్మికంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించడం వల్ల గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. అనంతరం సంపద కేంద్రం కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు ఉన్నారు.



వర్మికంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న డీపీఓ

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

డోన్: ప్యాపిలి మండలంలోని గోపాలనగరం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. బనగానపల్లె వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు గోపాలనగరం మిట్ట వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఒకరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రున్ని డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పార్టీ బలోపేతానికి వలంటీర్లే కీలకం



కాటసానిని కలిసిన పార్టీ జిల్లా వలంటీర్ల విభాగం అధ్యక్షుడు ప్రసాద్, తదితరులు

డోన్: జిల్లాలో వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగాన్ని పటిష్టం చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. శుక్రవారం నంద్యాలలోని ఆయన స్వగృహంలో వలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్, కార్యాలయం ప్రతినిధి మహేశ్వరరెడ్డి కాటసానిని కలిశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీని పటిష్టం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, సూపర్‌సిక్స్ హామీల అమల్లో జాప్యం తదితర విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె: మండలంలోని పాతపాడు, పసుపల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే వ్యవసాయానికి సరఫరా చేసే విద్యుత్ ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా చేయనున్నట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

బేతంచెర్ల: పట్టణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధుసూదన్‌రెడ్డి, టౌన్ ఏఈ పుల్లయ్య తెలిపారు. విద్యుత్ స్తంభాల మరమ్మతుల కారణంగా బేతంచెర్ల పట్టణం మొత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. పరిశ్రమల యజమానులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



డోన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ సభ్యులు

అమర జవాన్లకు నివాళి

డోన్ టౌన్: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులు స్మరించుకోవడం మనందరి బాధ్యత అని ఏబీవీపీ నంద్యాల జిల్లా కన్వీనర్ రవిశేఖర్ అన్నారు. 2019లో పుల్వామాలో ఉగ్రదాడిలో అమరులైన 40 మంది సైనికులను స్మరించుకుంటూ శుక్రవారం విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఏబీవీపీ సభ్యులు జగదీష్, దేవరాజు, విజయ్‌ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

బనగానపల్లెరూరల్: నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ రాష్ట్రాభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, అమరావతి అభివృద్ధితో పాటు పోలవరం నిర్మాణానికి రూ.12 వేల కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. బీజేపీ నాయకులు లింగన్న, చాందిని, శివకృష్ణయాదవ్, హరికృష్ణగౌడ్, యాదగిరి, లోకేశ్వరరెడ్డి, రవికుమార్, చెన్నయ్య, రామసుబ్బయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మధు

ఈ–శ్రమ్‌తో కార్మికులకు భరోసా

కొలిమిగుండ్ల: అసంఘటిత రంగ కార్మికులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ–శ్రమ్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని బనగానపల్లె లేబర్ ఆఫీసర్ శోభారాణి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డితో కలిసి పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ–శ్రమ్‌లో నమోదు చేసుకున్న కార్మికులకు 12 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు వస్తుందన్నారు. ఈకార్డుతో ప్రభుత్వం అందించే సామాజిక భద్రత పథకాలు, వివిధ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. నమోదు చేసుకున్న కార్మికులకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల బీమా అందుతుందని తెలిపారు. 16 నుంచి 59 ఏళ్ల లోపు కార్మికులు, ఆదాయ పన్ను చెల్లించని వారు అర్హులన్నారు. చిన్న, సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, తాపీ మేస్త్రీలు, వెల్డింగ్, సెంట్రింగ్, రాళ్లు కొట్టేవారు, టెలరింగ్, డ్రైవర్లు, హెల్పర్లు, చేతి వృత్తులు, వీధి వ్యాపారులు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బనగానపల్లె నియోజకవర్గంతో పాటు ఉయ్యాలవాడ, దొర్నిపాడులో 1,27,765 మందిని చేర్పించాలని టార్గెట్ విధించారన్నారు. ఇప్పటి వరకు 48 వేలకు పైగానే పూర్తి చేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు వీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈఓఆర్డీ శివప్రసాద్ పాల్గొన్నారు.



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ, లేబర్ ఆఫీసర్

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



విద్యార్థినులకు కంటి అద్దాలు అందజేస్తున్న వైద్యాధికారి



అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

కోవెలకుంట్ల: విద్యార్థులు కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయవద్దని.. సమస్య ఉంటే వైద్యులను సంప్రదించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ కంటి వైద్యాధికారి కృష్ణమోహన్ సూచించారు. శుక్రవారం పట్టణ శివారులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో దృష్టిలోపం ఉన్న 45 మంది విద్యార్థినులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు పుస్తకాలను 25 నుంచి 30 సెం.మీ. దూరంలో ఉంచి చదువుకోవాలని, అతి దగ్గరగా టీవీ చూడరాదని తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను ఎక్కువ సేపు వినియోగించవద్దన్నారు. పోషక విలువలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్ రాబర్ట్ కెన్నెడి, సీహెచ్‌ఓ లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, సుభాషిణి, ఎంఎల్‌హెచ్‌పీ సుధారాణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

డోన్ టౌన్: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న లోకల్ ఫండ్ స్కూల్‌లో (కోకలి బండ) శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఎంఈఓ–2 రామనర్సప్ప, యూపీహెచ్‌సీ డాక్టర్ షబాజ్ హుస్సేన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మద్దిలేటి నరసింహస్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కనుల పండువగా తిరుచ్చి ఉత్సవం

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితుడు జ్వాలా చక్రవర్తి ఆధ్వర్యంలో మద్దిలేటి నరసింహస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో కొలువుంచి ఆలయ మాడ వీధుల్లో మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ రామ్మోహన్, మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కోవెలకుంట్ల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, స్వచ్ఛతా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యర్థాలను వర్గీకరించడమనేది సుస్థిర వ్యర్థ నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ముఖ్యమైందన్నారు. అనంతరం వ్యర్థాలను వేరుచేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు కృష్ణదాసు, అన్నపూర్ణ, లక్ష్మీదేవి శశాంక, నాగేశ్వరరెడ్డి, నరేంద్రనాథరెడ్డి, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.



తడిచెత్త, పొడిచెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

దామోదర సంజీవయ్యకు నివాళి

బనగానపల్లె రూరల్: ఉమ్మడి ఏపీ మొదటి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదర సంజీవయ్య 104వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. భూసంస్కరణలు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో ప్రత్యేక రిజర్వేషన్ తదితర కార్యక్రమాలు ఆయన హయాంలోనే జరిగినట్లు గుర్తు చేశారు. కర్నూలు జిల్లాకు దామోదర సంజీవయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, రాయలసీమ అధ్యక్షుడు బొల్లి మద్దిలేటి, నాయకులు స్వామిదాసు, బెన్నీ, ఓబులేసు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

- బేతంచెర్ల: దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా పట్టణంలోని 4వ గ్రామ సచివాలయంలో మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు బొల్లి మద్దిలేటి, రామ సుబ్బయ్య, నాగరాజు సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. పేద దళితులకు 6 లక్షల ఎకరాల బంజరు భూమిని పంచి పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సంఘం నాయకులు మునిస్వామి, బాల పుల్లయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



బనగానపల్లె: సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాలమహానాయుడు నాయకులు